క్లుప్తంగా

తహసీల్దార్‌కు నాయీబ్రాహ్మణుల వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలో నాయీబ్రాహ్మణ సంఘ భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని కోరుతూ శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డెప్యూటీ తహసీల్దార్ సరితకు శనివారం నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు జంపాల శంకర్, అధ్యక్షుడు పందిర్ల నాగులు, సంఘ నాయకులు గుమ్ముల శంకర్, రామగిరి నాందేవ్, రామగిరి రవి, సత్యన్న, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఆశ'ల వంటావార్పు



భోజనం చేస్తున్న ఆశ కార్యకర్తలు

కెరమెరి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశ కార్యకర్తలు చేస్తున్న సమ్మె 13వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా ఆశ కార్యకర్తలు శనివారం వంటావార్పు నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట వంటలు చేసి నిరసన తెలిపారు. ఆశ కార్యకర్తలు సోంబాయి, భారతి, లలిత, రోజా, ఝూరుబాయి, వనిత, బొజ్జుబాయి, లక్ష్మిబాయి తదితరులు ఉన్నారు.

రైతుబీమా చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న కోనేరు కృష్ణారావు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని చింతగూడ గ్రామానికి చెందిన పిర్సింగుల తిరుమల్ గత కొన్ని రోజుల క్రితం మృతి చెందగా, ఆయన కుటుంబ సభ్యులకు రైతుబీమా ద్వారా మంజూరైన రూ. 5 లక్షల చెక్కును శనివారం జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు అందజేశారు. సర్పంచ్ సంజీవ్, మాజీ ఎంపీటీసీ నాగేందర్, తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అందజేస్తున్న ఈజీగాం పోలీసులు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని జంబుగ గ్రామంలో రిటైర్డ్ డెప్యూటీ రేంజ్ అధికారి నరసింహస్వామి వారం రోజుల క్రితం సెల్‌ఫోన్ పోగొట్టుకోగా, ఈజీగాం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసిన పోలీసులు సెల్‌ఫోన్‌ను గుర్తించి శనివారం బాధితుడికి అందజేశారు. ఎస్సై రామన్‌కుమార్ మాట్లాడుతూ సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. సెల్‌ఫోన్ కనుగొనడంలో ప్రతిభ కనబర్చిన కానిస్టేబుల్ నయీంను ఈ సందర్భంగా అభినందించారు.

రాముని చెరువు సుందరీకరణ పూర్తి చేయాలి

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని రాముని చెరువు అభివృద్ధి, సుందరీకరణ కోసం రూ.3.5కోట్లతో పనులను ప్రారంభించి, మధ్యలోనే నిలిపి వేశారని, వాటిని త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ రామునిచెరువు వాకర్ సభ్యులు శనివారం మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రామునిచెరువు కట్టపై వందలాది మంది ప్రతిరోజు వాకింగ్ చేయడంతో పాటు, ఆహ్లాదం కోసం వచ్చేందుకు అవకాశం లేకుండా అసంపూర్తిగా పనులను చేసి వదిలేశారన్నారు. కాంట్రాక్టర్ అలసత్వం వల్ల గతేడాదిన్నరగా పనులు నత్తనడకన సాగుతున్నాయని, వాకింగ్ ట్రాక్‌ను లెవలింగ్ చేసి, చెరువులోని పూడికతీత మట్టిని తొలగించి పనులను పూర్తి చేయాలని కోరారు.

ముందస్తు అరెస్ట్

చెన్నూర్: చెన్నూర్‌లో ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు పర్యటన సందర్భంగా పోలీసులు విపక్ష పార్టీ నాయకులకు ముందస్తుగా సీపీఐ వాసుదేవరావు అరెస్ట్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. వైఎస్సార్‌టీపీ దర్గం నరేశ్, కాంగ్రెస్ నాయకులు సుధాకర్‌రెడ్డి, లక్ష్మణ్, శ్రీధర్, ఖలీల్, నారాయణ, తదితరులు ఉన్నారు.

- పాలకులు మారుతున్నా మారని బతుకులు
- ఉపాధ్యాయుడు లేక మూతపడ్డ పాఠశాల
- బండరాళ్లతో అధ్వానంగా రహదారి

ఏళ్లుగా కష్టాలు..!



ఉపాధ్యాయుడు లేక మూసివేసిన పాఠశాల



కాలినడకన రేషన్ బియ్యం మోసుకొస్తున్న మహిళలు

తిర్యాణి: స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడుస్తున్నా గిరిజన గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. గూడాల్లో కనీస సౌకర్యాలు కూడా కల్పించకపోవడంతో గిరి ప్రజలు అనేక తిప్పలు పడుతున్నారు. గిరిజనుల సమగ్ర అభివృద్ధికి పాటు పడుతున్నామని ప్రభుత్వాలు చెబుతున్నా క్షేత్రస్థాయిలో అభివృద్ధి ఫలాలు కనిపించడం లేదు. మండలంలోని మాణిక్యపూర్ పంచాయతీ పరిధి అటవీ ప్రాంతంలో ఉన్న బుగ్గరామన్న గూడెంలో గిరిజనులు కనీస వసతులు లేక అష్టకష్టాలు పడుతున్నారు.

కాలమేదైనా కాలినడకే..

మండల కేంద్రం నుంచి దాదాపు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న బుగ్గ రామన్న గూడెంలో ఏళ్లుగా సమస్యలు రాజ్యమేలుతున్నాయి. గ్రామంలో 14 ఆదివాసీ కుటుంబాలు ఉండగా 40 మంది జనాభా ఉన్నారు. గ్రామానికి కనీసం రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఏ కాలంలోనైనా వారికి కాలినడకే దిక్కుగా మారింది. ప్రతీ చిన్న అవసరానికి 3.5 కిలోమీటర్ల దూరంలో ఉన్న మాణిక్యపూర్ గ్రామానికి వెళ్లాల్సిందే. నడిచే దారి కూడా బండరాళ్లతో నిండి ఉండటంతో పాటు మధ్యలో వాగు ఉండడంతో వర్షాకాలంలో రాకపోకలు సాగించడం చాలా కష్టంగా మారింది. రేషన్ బియ్యం, పింఛన్, నిత్యావసర సరుకుల కొనుగోలుకు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యకు దూరం..

బుగ్గరామన్న గూడెంలో మూడో తరగతిలోపు ఆరుగురు విద్యార్థులు ఉండగా, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేశారు. గత కొద్ది రోజుల క్రితం ఇక్కడ పనిచేసే ఉపాధ్యాయుడిని సంబంధిత శాఖ అధికారులు వేరో చోటకు డెప్యూటేషన్‌పై పంపించడంతో పాఠశాలను తెరిచేవారు లేకుండా పోయారు. దీంతో విద్యార్థులు విద్యకు దూరమై వ్యవసాయ పనులకు వెళ్తున్నారు. కాగా గ్రామానికి నేటికీ మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదు. గ్రామంలో ఉన్న బోర్‌వెల్ తరచూ మరమ్మతులకు గురవుతుండడంతో వాగు నీటిని తాగాల్సిన పరిస్థితి ఉంది. పడరాని పాట్లు పడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

మస్తు కష్టమవుతుంది..



ప్రతీ నెల రేషన్ బియ్యం నెత్తిపై మెసుకొని వచ్చుడు మస్తు కష్టమవుతుంది. కనీసం నడిచే దారి కూడా సక్రమంగా లేదు. పెద్ద బండ రాళ్లపై నుంచి నడుచుకుంటూ వెళ్తున్నాం. వానాకాలంలో వాగు ఉప్పొంగితే రాకపోకలు పూర్తిగా బంద్ అవుతున్నాయి.

– భీంబాయి, బుగ్గరామన్న గూడెం

కనీస సౌకర్యాలు కల్పించాలి



మా ఊరిలో కనీస సౌకర్యాలు కల్పించాలని ఎన్నోసార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు చెప్పుకున్నా ఎవరూ మమ్మల్ని పట్టించుకోవడం లేదు. నీటి కోసం తిప్పలు పడుతున్నాం. బోర్‌వెల్ పాడైతే వాగు నీటినే తాగాల్సిన పరిస్థితి ఉంది.

– గంగుబాయి, బుగ్గరామన్నగూడెం

పాఠశాలను తెరిపించాలి



మా దగ్గర ఉండే ఉపాధ్యాయుడిని వేరే చోటకు పంపడంతో గ్రామంలోని పాఠశాల మూతపడింది. దీంతో పిల్లలు చదువుకు దూరమవుతున్నారు. ఎవరూ పట్టించుకుంట లేరు. మా గ్రామంలోని సమస్యలు పరిష్కరించాలి. లేకుంటే ఈసారి ఓట్లు వేయం.

– సోంబాయి, బుగ్గరామన్న గూడెం

నేడు కుమురంభీం ఉత్సవ కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న సోనేరావు

కెరమెరి: మండలంలోని జోడేఘాట్‌లో మధ్యాహ్నం 12 గంటలకు ఆదివారం కుమురం భీం ఉత్సవ కమిటీ ఎన్నిక నిర్వహించనున్నట్లు కుమురం భీం మనుమడు కుమురం సోనేరావు, ఎంపీపీ పెందోర్ మోతిరాం పేర్కొన్నారు. శనివారం మండలంలోని హట్టిలో విలేకరులతో వారు మాట్లాడారు. ఈ నెల 28న నిర్వహించే 83వ భీం వర్ధంతిని ఘనంగా నిర్వహించేందుకు రాయిసెంటర్ సభ్యుల ఆధ్వర్యంలో సామరస్యంగా కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని దేవారి, పటేల్, పుజారి, ఉద్యోగులు, నిరుద్యోగులు, మహిళలు, యువకులు, ఆదివాసీ సంఘాల నాయకులు సకాలంలో తరలి రావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు న్యానేశ్వర్, జగన్నాథ్‌రావు, బొజ్జిరావు, లాలేషావ్, భీంరావు, రాము, సోము ఉన్నారు.

విద్యుత్ బకాయిలు చెల్లించాలి



కొనసాగుతున్న లోక్ అదాలత్

కెరమెరి: పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బకాయిలు చెల్లించి సంస్థకు సహకారమందించాలని విద్యుత్ శాఖ ఏఏవో తుకారాం అన్నారు. శనివారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిర్వహించిన విద్యుత్ లోక్‌అదాలత్‌లో పాల్గొని మాట్లాడారు. అనేక గ్రామాల్లో బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో సంస్థ నష్టాల్లో కూరుకుపోయే ప్రమాదం ఉందని, విద్యుత్‌కు సంబంధించి ఎలాంటి సమస్య ఉన్నా లోక్ అదాలత్‌లో పరిష్కరిస్తామన్నారు. 31 ఫిర్యాదులను పరిష్కరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఏడీఈ శ్రీనివాస్, ఏఈలు శ్రీనివాస్, సాధిక్‌మియా, ఆదర్శ, సబ్ ఇంజినీర్ రమేశ్, సాయికిరణ్, సాయిక్రిష్ణ, అధికారులు లక్ష్మీనారాయణ, రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి



వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు

రెబ్బెన: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంపీపీ జుమ్మిడి సౌందర్య అన్నారు. శనివారం మండలంలోని తుంగెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పాఠశాల ఆవరణను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పాఠశాలలో మరుగుదొడ్లు లేకపోవటంతో ఇబ్బందులకు గురవుతున్నామని విద్యార్థులు ఎంపీపీ దృష్టికి తీసుకెళ్లారు. మంచి నీటి సౌకర్యం కూడా కల్పించాలని, పాఠశాలకు బోర్‌వెల్ మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎంపీపీ పాఠశాలలోని సమస్యలను ఎమ్మెల్యే సక్కు, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దండె విఠల్‌ల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. హెచ్‌ఎం వినయ్‌కుమార్, ఉప సర్పంచ్ సాయికృష్ణ, బీఆర్‌ఎస్ నాయకులు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

'అవినీతిలో ఎమ్మెల్యేకు వాటా'



మాట్లాడుతున్న పాల్వాయి హరీశ్‌బాబు

బెజ్జూర్: బెజ్జూర్ సహకార సొసైటీలో జరిగిన రూ.కోటి అవినీతిలో సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్పకు వాటా ఉందని బీజేపీ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాల్వాయి హరీశ్‌బాబు ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలోని సహకార బ్యాంక్ ఎదుట పార్టీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సొసైటీ పాలకవర్గ సభ్యులు, అధికారులు కలిసి రైతుల డబ్బులు కాజేశారన్నారు. సొసైటీలో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతోందని తెలిపారు. అనంతరం ఆశా వర్కర్ల సమ్మెకు ఆయన మద్దతు తెలిపారు. ధర్నాలో నాయకులు మాజీ జెడ్పీటీసీలు మల్లయ్య, సుధాకర్ రావు, సింగిల్ విండో మాజీ చైర్మన్ కొండ్ర మనోహర్‌గౌడ్, మాజీ ఎంపీపీ శంకర్, బాలకృష్ణ, సతీశ్, నానయ్య, దిగంబర్, తుకారం తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న డబ్ల్యూపీఎస్ వార్షిక క్రీడలు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలో డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ వార్షిక క్రీడలు కొనసాగుతున్నాయి. శనివారం గోలేటి టౌన్‌షిప్‌లోని భీమన్న స్టేడియంలో ఏరియా స్థాయి డిపార్ట్‌మెంటల్ హాకీ పోటీలు నిర్వహించారు. పోటీల్లో కైరిగూడ పీవో జట్టు, ఎస్‌వోటూ జీఎం జట్టు తలపడగా కైరిగూడ ఓసీపీ సీనియర్ అండర్ మేనేజర్ రాంటెంకి మల్లయ్య ముఖ్య అతిథిగా హాజరై పోటీలు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. కంపెనీ లెవల్ పోటీల్లో పతకాలు సాధించి ఏరియాకు గుర్తింపు తీసుకురావాలని కోరారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలు ప్రారంభించారు. పోటీల్లో తలపడిన కైరిగూడ పీవో జట్టు, ఎస్‌వోటూ జీఎం జట్టు చెరో పాయింట్ సాధించటంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. స్పోర్ట్స్ కోఆర్డినేటర్ మురహరిరావు, జనరల్ కెప్టెన్ చంద్రకుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్యనందిస్తాం

నార్నూర్: గ్రామస్తుల సహకారం, ఉపాధ్యాయుల సమన్వయంతోనే ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యనందిస్తామని ఎంఈవో రాపల్లి ఆశన్న అన్నారు. శనివారం నార్నూర్ మండలంలోని గుంజాల ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో అస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్న ఉపాధ్యాయులు రామారావు, లక్ష్మీకాంతంలను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ సుభాణి, సర్పంచ్, ఉప సర్పంచ్ పాల్గొన్నారు.

జవాన్‌కు ఘన స్వాగతం

నార్నూర్: గాదిగూడ మండలంలోని లోకారి(కె) గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ మాడవి రాజ్‌కుమార్‌కు శనివారం సర్పంచ్ మెస్రం దేవురావు, గ్రామ పటేల్ మెస్రం భీంరావు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఆర్మీ ఉద్యోగంలో చేరి తొలిసారిగా స్వగ్రామానికి తిరిగి రావడంతో ఆదివాసీ గిరిజనులు ఘన స్వాగతం పలికి సత్కరించారు. యువత రాజ్‌కుమార్‌ను ఆదర్శంగా తీసుకొని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో దేవారి జగ్గేరావు, కారోబారి మండాడి దౌలత్‌రావు, పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం మండలాధ్యక్షుడు మెస్రం లింగు, ఉపాధ్యాయుడు లక్ష్మణ్, వెడ్మా జ్యోతిరాం, అంబురావు ఉన్నారు.

పన్ను బకాయిలు చెల్లించాలి

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ పరిధిలో పన్ను బకాయిలు ఉన్నవారు వెంటనే మొత్తం పన్ను చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో గల మసీదు కమిటీకి చెందిన భవనం పన్ను రూ.2.50లక్షలు ఉండగా, దానిని చెల్లించకపోవడంతో శనివారం మున్సిపల్ రెవెన్యూ అధికారి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది తాళం వేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. 2024మార్చి నెల వరకు చెల్లించే పన్ను సైతం వెంటనే చెల్లించి, ప్రజలు సహకరించాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం

నస్పూర్: పట్టణ పరిధిలోని సీసీసీ కార్నర్ వద్ద కరీంనగర్‌కు చెందిన మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. సుమారు 100మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ గుర్రం కిరణ్, వైద్యురాలు హర్షిత, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ శ్రీనివాస్ గోగు, తదితరులు పాల్గొన్నారు.

వంట చేస్తున్న ఉపాధ్యాయులు



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న టీచర్లు

కెరమెరి: మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మెలో ఉండడంతో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఉపాధ్యాయులు వంట చేసి విద్యార్థులకు వడ్డించారు. వారం రోజులుగా కార్మికులు పాఠశాలలకు హాజరు కాకపోవడంతో విద్యార్థులు ఖాళీ కడుపుతో ఉండకూడదనే వంట చేస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

బీఆర్‌ఎస్ పాలనలోనే మెరుగైన రోడ్లు



సక్కును సన్మానిస్తున్న నాయకులు

రెబ్బెన: బీఆర్‌ఎస్ పాలనలోనే నియోజక వర్గంలోని మారుమూల గ్రామాలకు సైతం మెరుగైన రోడ్ల సౌకర్యం కలుగుతుందని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. ఏళ్లుగా కొండపల్లి గ్రామస్తులు ఎదురుచూస్తున్న బీటీ రోడ్డు మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యేను కొండపల్లి బీఆర్‌ఎస్ నాయకులు వడై పోషన్న, పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్‌లు శనివారం క్యాంపు కార్యాలయంలో కలిసి శాలువాతో సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ గిరిజన గ్రామాలకు సైతం మెరుగైన రోడ్డు సౌకర్యం ఉండాలనే లక్ష్యంతో స్పెషల్ డెవలప్‌మెంట్ నిధులు మంజూరు చేశారన్నారు.

పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



పత్తి పంట పరిశీలిస్తున్న ఏఈవో

కౌటాల: రైతులు పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఈవో దుర్గాభవాని అన్నారు. శనివారం మండలంలోని ముత్తంపేట గ్రామ శివారులో పత్తి, వరి పంటలను పరిశీలించారు. వరి పంటలో సుడి దోమ సోకిందని, దీంతో పంట దిగుబడి తగ్గుతుందన్నారు. సుడిదోమ నివారణకు లీటర్ నీటిలో డైనోటిఫ్యూరోన్ 0.4 గ్రాములు కలిపి మొక్క మొదళ్లు తడిచేలా పిచికారీ చేసుకోవాలని సూచించారు. పత్తిలో ఆకుమచ్చ తెగులు నివారణకు ఆజోక్సిస్టోబిన్ 11శాతం, టెబ్యుకోనోజల్ 18.3 శాతం, ప్లాంటమైసిన్ 100 గ్రాములు ఎకరా చొప్పున వేయాలన్నారు. రైతులు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

'హక్కులు సాధించే వరకు పోరాడుదాం'



రెబ్బెన: నిరసన తెలుపుతున్న కార్మికులు

కెరమెరి: హక్కులు సాధించే వరకు పోరాడుదామని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణమాచారి అన్నారు. మండలంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట కొనసాగుతున్న ఎండీఎం వర్కర్ల ధర్నాలో పాల్గొని మాట్లాడారు. చాలీచాలని వేతనాలతో విద్యార్థులకు వంటలు చేయడం సాధ్యం కాదన్నారు. లలిత, ప్రేమల, కవిత, రజిత, రాజవ్వ, సునీత, శోభ, మెంగుబాయి, సోంబాయి, శాంతాబాయి, రాజవ్వ తదితరులు ఉన్నారు.

రెబ్బెన: తమ సమస్యల పరిష్కారం కోసం మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన సమ్మెపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం రవీందర్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మెకు శనివారం సీపీఐ, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షుడు పూదరి సాయి, మండల కార్యదర్శి బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీ



రెబ్బెన: చీరలు అందజేస్తున్న ఎంపీపీ సౌందర్య

పెంచికల్‌పేట్: మండలంలోని చేడ్వాయి, ఎల్లూర్ గ్రామాల్లో బతుకమ్మ చీరలను శనివారం సర్పంచ్‌లు చౌదరి సుజాత, దుర్గం రాజన్నలు మహిళలకు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం దసరా కానుకగా మహిళలకు చీరలు అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

రెబ్బెన: రాష్ట్ర ప్రభుత్వం దసరా పండుగ కానుకగా అందజేసే బతుకమ్మ చీరలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ జుమ్మిడి సౌందర్య అన్నారు. మండలంలోని తుంగెడ పంచాయతీ కార్యాలయంలో శనివారం మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. సర్పంచ్ పెంటయ్య, ఉపసర్పంచ్ సాయికృష్ణ, పంచాయతీ కార్యదర్శి రాధిక, బీఆర్‌ఎస్ నాయకుడు ఆనంద్ పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



క్రీడా సామగ్రి పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ



క్రీడా కిట్లు అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు అన్నారు. శనివారం మండలంలోని మోతుగూడ, కొసార గ్రామంలో మహిళలకు బతుకమ్మ చీరలు, యువతకు క్రీడాకిట్లు పంపిణీ చేశారు. సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, ఎంపీవో ప్రసాద్, సర్పంచ్ సువర్ణ, కార్యదర్శి రాందాస్, రమేశ్, వినోద్, ఐకేపీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని రైతువేదికలో సీఎం కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లను జెడ్పీటీసీ సముద్రాల సరిత శనివారం ఆయా గ్రామపంచాయతీలకు అందజేశారు. ఆమె మాట్లాడుతూ యువతలో క్రీడల పట్ల ఆసక్తిని పెంచటానికి ప్రభుత్వం ప్రతీ పంచాయతీకి ఉచితంగా క్రీడా సామగ్రి అందజేస్తుందన్నారు. సర్పంచ్‌లు శ్రీనివాస్, రాజన్న, మధునయ్య, ఎంపీటీసీ రాజన్న, కోఆప్షన్ సభ్యుడు సాజీద్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

యువకులకు సన్మానం



యువకులను సన్మానిస్తున్న గ్రామస్తులు

పెంచికల్‌పేట్: మండలంలోని చేడ్వాయి, దరోగపల్లి గ్రామాలకు చెందిన ఏడుగురు యువకులు కానిస్టేబుళ్లుగా ఎంపిక కాగా శనివారం స్థానిక రైతువేదికలో అధికారులు, గ్రామస్తులు, యువకులు శాలువాలతో సన్మానించారు. మారుమూల గ్రామం నుంచి ప్రభుత్వ కొలువులకు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో గంగాసింగ్, ఎంఈవో రమేశ్‌బాబు, గ్రామస్తులు చౌదరి శ్రీనివాస్, ఎస్‌కే బాబు, చౌదరి సత్తన్న, పంచాయతీ కార్యదర్శులు జావీద్, రాకేశ్, ఉపాధ్యాయుడు చౌదరి వెంకటేష్, యువకులు పాల్గొన్నారు.

చింతలమానెపల్లి: మండలంలోని డబ్బా గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు విఠల్, మోయిన్, జరీనాలు కానిస్టేబుళ్లుగా ఎంపిక కావడంతో శనివారం స్థానిక శివరామసాయి యూత్ ఆధ్వర్యంలో వారిని సన్మానించారు.

రెబ్బెన: ఇటీవల విడుదలైన పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో ఉద్యోగాలు సాధించిన బిరుదు సతీష్, గోలెం ప్రవీణ్, కొవ్వూరి శ్రీకాంత్, ముద్దం రూపశ్రీ, ముద్దం పూజితలను నంబాల సర్పంచ్ చెన్న సోమశేఖర్ జీపీ కార్యాలయంలో సన్మానించారు. పంచాయతీ కార్యదర్శి పుష్పలత, వార్డు సభ్యుడు సంజీవ్ కుమార్‌జైస్వాల్, గ్రామస్తులు పాల్గొన్నారు.